తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
హైదరాబాద్
రంగారెడ్డి - మేడ్చల్
మంగళవారం, ఫిబ్రవరి 10, 2026
పేజీలు: 3



మేడారం హుండీల లెక్కింపు...

## 5 రోజుల్లో 11.83 కోట్ల ఆదాయం



3లో

- ఐదు రోజుల్లో 788 హుండీల లెక్కింపు
- ఈరోజు 163 హుండీలను లెక్కించగా 1.12 కోట్ల ఆదాయం
- మిగిలిన హుండీల లెక్కింపునకు మరో 2 రోజులు పట్టే అవకాశం




## నార్సింగ్ చౌరస్తాలో 3 వేల గజాల పార్కును
# కాపాడిన హైడ్రా

### రూ. 60 కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్




అక్షర గళం, హైదరాబాద్, : గండిపేట మండలం, నార్సింగ్ విలేజ్, అరుణోదయ హౌసింగ్ సొసైటీలోని పార్కును కబ్జాల చెర నుంచి సోమవారం హైడ్రా విముక్తి కల్పించింది. నార్సింగ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాయానికి చేరువులో అరుణోదయ కాలనీ హుడా అనుమతి పొందిన లే ఔట్లో 6078 గజాలు పార్కు కోసం కేటాయించారు. ఈ పార్కు స్థలంపై స్థానికంగా ఉన్న వారి కన్ను పడింది. ఇప్పటికే 3 వేల గజాల వరకూ అక్రమ నిర్మాణాలు వచ్చేశాయి. మిగిలిన 3 వేల గజాల పార్కు స్థలంలో 1600ల గజాలను స్థానికంగా ఉన్న వ్యక్తి కబ్జా చేశారు. ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించి.. అందులో షెడ్డులు వేశారు. ఈ 1600ల గజాల ఆక్రమణలపై గతంలో నార్సింగ్ మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. నిర్మాణాలను తొలగించారు. అయినా కబ్జాలు ఆగలేదు. నార్సింగి మున్సిపాలిటీ ఇప్పుడు జీహెచ్ ఎంసీలో కలవడం.. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఇదే అదనుగా మళ్లీ 1600ల గజాలను తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. చుట్టూ ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించి.. లోపల తాత్కాలిక షెడ్డులు కూడా కట్టాడు. ఈ కబ్జా పూర్వాపరాలను వివరిస్తూ స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాలమేరకు హైడ్రా అధికారులు రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్కు స్థలంగానే నిర్ధారించుకున్నారు. మొత్తం పార్కు స్థలం 6078 గజాలు కాగా.. 3వేల గజాల వరకూ అక్రమ కట్టడాలు వచ్చేశాయి. మిగిలిన 3వేల గజాలను హైడ్రా సోమవారం కాపాడింది. పార్కు హద్దులను నిర్ధారిస్తూ చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే పార్కు కోసం కేటాయించిన స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.



2లో

## కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



3లో

## అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

::: కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



2లో

## భర్తీచేసిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

:::: నిరుద్యోగ జేపీసీ నేతలు

# కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి,: ఈనెల 13 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ మన చౌదరికి, మల్కాజ్గిరి డిసిపి శ్రీధర్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఆర్డిఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేష్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి లకు ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవా లలో విఐపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారికేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికి తెలిపారు. జాతరలో అధిక సంఖ్యలో



భక్తులు పాల్గొంటారు ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శనార్థం వచ్చే వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.

# భర్తీచేసిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## నిరుద్యోగ జేఏసీ నేతలు



అక్షర గళం, హైదరబాద్ : భర్తీ చేసిన ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఉద్యోగాల భర్తీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సమావేశాలలో అబద్దాలపై మాట్లాడుతుండటంపై నిరుద్యోగ జేఏసీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్లు లేక 2 రోజుల క్రితమే కుమారస్వామి అనే నిరుద్యోగి చనిపోయారని, ఎక్కడ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశారో ఈ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు యూత్ డిక్లరేషన్ లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియోను మీడియా సమావేశం ముందు ప్రదర్శించారు. రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక దాదాపు 20 మందికీ పైగా నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్లు లేక ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వారం రోజుల క్రితం ఐదు సంవత్సరాల కాలంలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పామని తప్పుడు కూతలు కూస్తున్నారు అని , ఒకసారి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో మహేష్ కుమార్ గౌడ్ చదవాలని చురకలు అంటించారు . ఇంకా ఆలస్యం చేయకుండా ఉద్యోగ నోటిఫికేషన్ లను విడుదల చేయాలని, చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు లైబ్రరీ చుట్టూ తిరిగిన కాంగ్రెస్ నాయకులు ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ఎందుకు మాట్లాడడం లేదని పేర్కొన్నారు. బిశ్వాల్ కమిటీ ప్రకారం లక్ష 90వేల ఉద్యోగాలను భర్తి చేయాలని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కూడా అధికారంలోకి రాక ముందు బిస్వాల్ కమిటీ రిపోర్ట్ ప్రకారం చాలా ఖాళీలు ఉన్నాయని భర్తీ చేయాలని అతనే స్వయంగా చెప్పారని గుర్తుకు చేశారు .నిరుద్యోగులతో ఈ ప్రభుత్వము చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్ ,ఇంద్ర నాయక్, రవి రాథోడ్ ,ఉపేందర్, జనార్ధన్, భూక్య కుమార్, శ్రీనివాస్, సోమేశ్ ,రమేష్, రవి నాయక్ ,గణేష్ ,బాలకోటి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ముగిసిన ఎన్నికల ప్రచారం.. ఎల్లుండి పోలింగ్




**రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.



# వైభవంగా మల్లన్న స్వామి జాతర

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : దుండిగల్ సర్కిల్ డిపోచంపల్లిలో మల్లన్న స్వామి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా జరుగుతున్న మల్లన్న స్వామి జాతర కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, నాయకులు రాజశేఖర్ యాదవ్, సుదర్శన్ యూత్ నాయకులు విష్ణు యాదవ్, శ్రీకాంత్ యాదవ్, గణేశ్, రాజు, శ్రీధర్, అభి, భాను, మహేష్ యాదవ్, కుమ్మరి మహేష్, శ్రీకాంత్, నవీన్ యాదవ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# తప్పిపోయిన బాలిక క్షేమంగా తల్లి చెంతకు

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : తప్పిపోయిన బాలికను దుండిగల్ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. దుండిగల్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారంఉ ఉత్తరప్రదేశ్కు చెందిన మంజు దేవి ప్రస్తుతం గండిమైసమ్మ వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె కుమార్తె (8) సోమవారం ఉదయం11 గంటల సమయంలో కాలనీలో ఆడుకుంటూ వెళ్లి తప్పిపోయింది. సమీప ప్రాంతాల్లో వెతికినా బాలిక ఆచూకీ లభించకపోవడంతో మధ్యాహ్నం 3 గంటలకు డయల్-100 ద్వారా దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే దుండిగల్ పీఎస్ పెట్రోల్ మొబైల్-1 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో గాలించి బాలిక ఆచూకీని గుర్తించారు. 45 నిమిషాల వ్యవధిలోనే బాలికను సురక్షితంగా తల్లికి అప్పగించారు. పోలీసులు తమ కుమార్తెను క్షేమంగా అప్పగించడంతో బాలిక తల్లి ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మేడారం హుండీల లెక్కింపు... ఐదు రోజుల్లో రూ.11.83 కోట్ల ఆదాయం

**ఐదు రోజుల్లో 788 హుండీల లెక్కింపు**

**ఈరోజు 163 హుండీలను లెక్కించగా 1.12 కోట్ల ఆదాయం**

**మిగిలిన హుండీల లెక్కింపునకు మరో 2 రోజులు పట్టే అవకాశం**

మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. నేటితో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఈరోజు 163 హుండీలను లెక్కించగా రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.



# మున్సిపల్ ఎన్నికలు.. తెలంగాణలోని ఆ ప్రాంతాల్లో రెండు రోజులపాటు వైన్స్ బంద్

**ఈరోజు సాయంత్రం నుంచి ఎల్లుండి సాయంత్రం వరకు ఆంక్షలు**

**ఓట్ల లెక్కింపు రోజైన 13న కూడా మద్యం అమ్మకాలపై నిషేధం**

**నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు చేస్తామని అధికారుల హెచ్చరిక**

**123 పట్టణ స్థానిక సంస్థలకు ఎల్లుండి పోలింగ్**



తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు, బార్లను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రచారం ముగిసే సమయమైన ఇవాళ సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ ముగిసే ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం అమ్మకాలపై పూర్తి నిషేధం విధిస్తున్నట్లు ఎన్నికల, ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. అంతేకాకుండా ఓట్ల లెక్కింపు జరిగే ఈ నెల 13వ తేదీన కూడా పూర్తిస్థాయిలో వైన్స్, బార్లను మూసివేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఆంక్షలు కేవలం ఎన్నికలు జరిగే 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలోనే అమల్లో ఉంటాయని, రాష్ట్రవ్యాప్తంగా వర్తించవని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పోలింగ్‌లో సుమారు 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. కాగా, రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు మహబూబ్‌నగర్, మంచిర్యాల, కొత్తగూడెం, నల్గొండ, కరీంనగర్, రామగుండం, నిజామాబాద్ కలిపి మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి. మెత్తం 2,996 వార్డులకు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

# తెలంగాణలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి: డీకే అరుణ

## ::: రేవంత్ సర్కార్ పై విమర్శలు గుప్పించిన అరుణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆమె మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నులు పెంచేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఖజానాలో చిల్లిగవ్వ లేదని... మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శించారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించామని అరుణ తెలిపారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించానని చెప్పారు. మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్ పూర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరమని అరుణ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పారదర్శక, అవినీతి రహిత పాలనే బీజేపీ లక్ష్యమని చెప్పారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై దృష్టి సారిస్తామని... కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని తెలిపారు.

# పతంగి కోసం వెళ్లిన బాలుడు మృతి

అక్షర గళం, రాజేంద్రనగర్ : ఆడుకుంటూ పతంగి కోసం వెళ్లిన బాలుడు బిల్డింగ్ పైన నుండి పడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధి లోని సాయిబాబా నగర్ లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మంచిర్యాల జిల్లా బెల్లం పల్లి కి చెందిన మహేందర్ సుజాత దంపతులకు కుమారుడు హేమంత్ (10) సాయిబాబా నగర్ లో ఆడుకుంటూ పతంగి కోసం వెళ్లి బిల్డింగ్ పైన నుండి పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి కి తరలించారు.

# ఈ నెల 11న ప్రభుత్వ, ఎయిడెడ్ , ప్రైవేట్ పాఠశాలలు/జూనియర్ కళాశాలలకు సెలవు

అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి : ఈ నెల 11న పోలింగ్ నేపథ్యంలో మెడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని ఎన్నికల నోటిఫై చేసిన ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ , ప్రైవేట్ పాఠశాలలు/జూనియర్ కళాశాలలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సెలవు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లకు 2వ సాధారణ ఎన్నికల నిర్వహణ లో భాగంగా మెడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని పోలింగ్‌కు ముందురోజు 10వ తేదిన , పోలింగ్ రోజున 11న, ఓట్ల లెక్కింపు రోజున 13న మెడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలో పోలింగ్/కౌంటింగ్ కోసం గుర్తించబడిన విద్యా సంస్థల భవనాలు షెడ్యూల్ ప్రకారం ఎన్నికల అధికారుల వినియోగానికి అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆయా తేదిలలో పోలింగ్ సిబ్బందికి అప్పగించాల్సిందిగా ఆదేశించారు.



# అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

## ::: కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అక్షర గళం, కూకట్ పల్లి : అభివృద్ధి పనులకు సంబంధించి నిధులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. కూకట్ పల్లి డివిజన్లోని సాయి నగర్ కాలనీలో డ్రైనేజ్ , రోడ్డు సమస్యలను కాలనీవాసులు వివరించగా సోమవారం ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, విష్ణు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.